క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మిర్యాలగూడ : ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు, సాగర్ ఎడమకాల్వకు నీళ్లందించకపోవడాన్ని నిరసిస్తూ నేడు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

మిర్యాలగూడ అర్బన్ : ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం ఉదయం 10గంటలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

డిండి : వేసవి కాలం ప్రారంభం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్నదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీటిని అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సీపీఐ తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో దేవరకొండ డివిజన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. టీఎస్ఎస్‌పీడీసీఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసులు, సెక్రటరీగా నేనావత్ సంతోష్, ఉపాధ్యక్షుడు మేకల కోటిరెడ్డి, సైదులు, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరి రామలింగం, లక్పతి, పాండు, హనుమ, సైదులు, గంగాధర్‌రెడ్డి, ట్రెజరిలుగా రాజు, కార్యవర్గ సభ్యులుగా హరీశ్, రమేశ్, మున్నా, ఇస్మాయిల్, లతీఫ్, అనిల్ ఎన్నికయ్యారు.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

మిర్యాలగూడ టౌన్ : భారత ప్రధాని నరేంద్ర మోదీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు యువత సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పెద్దమాం భరత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ మండలాల బీజేవైఎం అధ్యక్షులు భిక్షపతి, మాలోతు రంగా, పానుగోటి కోటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మేడి నవీన్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు మొదల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి కిషన్ నాయక్, జగదీష్, తేజావత్ వెంకటేష్, మహేష్, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



శ్రీశైలంయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చందంపేట : తిమ్మాపురం నూతన పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన కొంగ్ర శ్రీశైలంయాదవ్‌ను తిమ్మాపురం సొసైటీ కార్యాలయంలో మంగళవారం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, కొండల్‌యాదవ్, భిక్షపతి, ప్రసాద్‌యాదవ్, చిత్రం జోయల్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్



చింతపల్లి : మండల తహసీల్దార్‌గా మంగళవారం పి.విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చింతపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన శంషొద్దీన్ సచివాలయానికి బదిలీకాగా ఆయన స్థానంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను చింతపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

కొత్త నందికొండలో విషజ్వరాలు

- ఇంటికొక జ్వరపీడితుడు
- గ్రామంలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తం
- వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు





గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుద్ధ్యం



వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న బాలిక

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ, గోన్యాతండాతో పాటు పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లతో పాటు పలు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కొత్తనందికొండ గ్రామంలోని ప్రతి ఇంటిలో ఒక జ్వరపీడితులున్నారు. ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వేలాది రూపాయాలు ఖర్చు చేస్తూ వైద్యం చేయించుకుంటున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్న వైద్య సిబ్బంది మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో చెత్తాచెదారంతో వీధులు దర్శనమిస్తున్నారు. మురుగు కాల్వలు పూడికతీయకపోవడంతో మురుగు నిల్వ ఉండి దోమలు ప్రబలి విషజ్వరాలకు గురవుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థను అధికారులు తక్షణమే మెరుగుపరిచేందుకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలి



గ్రామంలో మురుగుకల్వల పూడిక తీయడం లేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వచ్చాయి. రూ.20వేలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నాం. పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరిచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

\- రమావత్ బుజ్జి, కొత్త నందికొండ

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సుఖేందర్‌రెడ్డి

చందంపేట : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య తన కుమారుడు ముత్యాల వెంకటేశ్, తల్లి ముత్యాల లక్ష్మమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో లయమన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, శంకర్‌నాయక్, టీవీఎస్.రెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్, మోహన్, రవి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్ల నియామకం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్, విద్యుత్ నంబర్లు నమోదు చేసేందుకు 12మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించినట్లు చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. మంగళవారం స్థానిక చాంబర్స్‌లో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని 48 వార్డులకు చెందిన వారు ఆయా వార్డు ఆఫీసర్ల వద్ద గ్యాస్, కరెంట్ బిల్లుల నంబర్ల అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. శ్రీలత 1, 2, 3, 4 వార్డులు, ఎం. శ్రీనివాస్ 33, 34, 35, 45 వార్డులు, ఎం. భవాని 5, 15, 16, 17 వార్డులు, ఎస్. సైదులు 18, 19, 36, 37 వార్డులు, ఎన్. సంధ్యారాణి 20, 46, 47 వార్డులు, రాణా ప్రతాప్ 6, 7, 21, 22 వార్డులు, జానీ 8, 9, 10, 11వార్డులు, బి. రామలింగం 12, 13, 14, 31, 32 వార్డులు, వెంకటేశ్వర్లు 41, 42, 43, 44 వార్డులు, ఎన్. సుబ్రమాణ్యం 29, 30, 38, 48 వార్డులు, ఎండీ ఆజాస్ 26, 27, 28, 40 వార్డులు, జి. వెంకటేశ్వర్లు 23, 24, 25, 39 వార్డులకు నియమించారు. గ్యాస్, విద్యుత్ నంబర్లు అప్డేట్ కానీ వారు ఆయా వార్డు ఆఫీసర్ల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ఈనెల 8న శివరాత్రి పర్వదినం సందర్భంగా దామరచర్లలోని వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరాలయానికి వచ్చే భక్తులకు అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులతో, అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, ఆలయ కమిటీ చైర్మన్లు సిద్దయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో నెరవేరిన కల

- యాచారం, మారేపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ



మారేపల్లికి ఆర్టీసీ బస్సు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

హాలియా : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు యాచారం, మారేపల్లి గ్రామాలకు మంగళవారం ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ జరగడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత 16నెలల క్రితం ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. కొన్ని అనివార్య కారణాలతో ఆయా గ్రామాలకు వెళ్లే బస్సు సౌకర్యాన్ని నల్లగొండ డిపో వారు నిలిపివేశారు. నల్లగొండ నుంచి కనగల్లు, మారేపల్లి, యాచారం గ్రామాల మీదుగా హాలియా వరకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందుల విషయంపై అక్కడి ప్రజలు ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన జయవీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తనను గెలిపిస్తే ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తాని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దీంతో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకుగాను మారేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎంఏ హరుణ్ అంజాద్‌తో పాటు ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని కోదండాపురం గ్రామంలో పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు మంగళవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రథాన్ని రకరకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ భక్తుల గోవింద నామస్మరణతో రథోత్సవ వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగేందుకు ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా మహిళలతో నిర్వహించిన కోలాట ప్రదర్శన, చిన్నారుల భరత నాట్యప్రదర్శన, ఆర్కెస్ట్రా కార్యక్రమం ఆహువుతలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, ఆలయ పూజారి శ్రీ కోమందూరి శ్రీనివాస చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, పోశంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరామహేందర్, బొద్దుపల్లి వెంకటరమణాచారి,నక్క బిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, వెంకటయ్యలు భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

నాగార్జునసాగర్ : నందికొండ హిల్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్‌వైజర్ గౌసియాభేగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆడ, మగ పిల్లలను ఒకే విధంగా చూడాలని లింగవివక్షతపై తల్లులకు వివరించారు అనంతరం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శారద, ఆయా సుజాత, గర్భిణులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగాల అభిషేక మహోత్సవం

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని శ్రీ భ్రమరాంభమల్లిఖార్జున స్వామి దేవాలయంలో మంగళవారం 22వ ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేక మహోత్సవాన్ని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండే దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న అర్చకులు

పంప్‌హౌస్‌కు చేరిన పంపు సెట్



పంపుహౌస్‌లో కొత్తగా తెచ్చిన పంపు సెట్

సాక్షి ఎఫెక్ట్..

నాగార్జునసాగర్ : నందికొండలో నీటి కష్టాలను తెలిపే ఫొటోను సోమవారం సాక్షి దినపత్రిక జిల్లా మొదటి పేజీలో ప్రచురించింది. దీంతో స్పందించిన సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి స్థానిక నాయకులతో వివరాలు తెప్పించుకోని అధికారులతో అంచనాలు తయారు చేయించి తెప్పించారు. వెంటనే రెండు పంపులకు ఆర్డర్ పెట్టారు. ఒక పంపు మంగళవారం పంప్‌హౌస్‌కు తీసుకువచ్చారు. మరో పంప్ రెండు రోజుల్లో తేనున్నట్లుగా అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల్లో నీటి సరఫరాను పునరుద్దరించనున్నట్లుగా అధికారులు తెలిపారు. త్వరితగతిన నీటి సరఫరాను పునరుద్ధిరించాలని స్థానికులు కోరుతున్నారు. స్పందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్జీ కళాశాలలో క్రీడా పోటీలు

రామగిరి(నల్లగొండ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కడారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ప్రణాళిక



వర్కర్లతో మాట్లాడుతున్న ఏటీడీఓ లక్ష్మారెడ్డి

పెద్దవూర : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పదో తరగతిలో వందశాతంఉత్తీర్ణతే ధ్యేయంగా వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా సహాయ గిరిజనాభివృద్ధి అధికారి (ఏటీడీఓ) కడారు లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.శరత్ ఆదేశానుసారం ఆయన మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్‌లలో జీపీఎస్ ట్యాబ్ బేసడ్ అటెండెన్స్‌ను పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వర్కర్లకు సంబంధించిన హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ జిల్లా వ్యాప్తంగా తన సొంత ఖర్చులతో ఒక్కొక్క విద్యార్థికి రూ.5వేలు ఇస్తానని తెలిపారు. అనంతరం హాస్టల్ వర్కర్లతో సమావేశం నిర్వహించి వంట గది పరిసరాలను, హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ప్రభుత్వ మెనూను పాటిస్తు నాణ్యమైన బోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, వార్డెన్‌లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, బి.కృష్ణ, సైదులు, శ్రీనునాయక్, సంధ్య, షాహీన్‌బేగం, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ, మండలంలో నిషేధిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించామని మండల తహసీల్దార్ ఎన్. హరిబాబు అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు ధరణిలో నిషేదిత భూములుగా పెర్కొన్నారు. దీని వలన భూములు కొనుగోలు, అమ్మకాలు, నిర్మాణాలను చేపట్టకలేకపోవడం జరిగిందన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ, మండలంలో 1496మంది బాధితులు దరఖాస్తులు చేసుకోవడంతో ఆ దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపారు. భూమి మార్కెట్ విలువను బట్టి నిషేదిత అనేది ధరణి నుంచి తొలగించడం జరుగుతుందన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



పెద్దఅడిశర్లపల్లి : సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులను అందజేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆయన పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో సంబంధిత శాఖల అధికారులు పారదర్శకత పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సైదులు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మా, సిరాజ్‌ఖాన్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, నేతాళ్ల శ్రీను, శ్రీశైలం యాదవ్, నేతాళ్ల శ్రీను, కొర్ర రాంసింగ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పెద్దఅడిశర్లపల్లి : నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో అదనపు తరగతిగదులు ప్రారంభం, మండలంలోని నంభాపురం, పెద్దగట్టు, చింతల్‌తండా, నక్కలపెంట తండాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, వైస్ ఎంపీపీ అర్వపల్లి సరితానర్సింహా, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, నారాయణ, కాంగ్రెస్ నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఎల్లయ్య, బోద్యానాయక్, ఎంఈఓ తరి రాము, తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్రియతండా, చెన్నారం, గన్యనాయక్‌తండా, కేశ్యతండా, వర్ధమానిగూడెం, చింతకుంట్ల, కొర్రతండాలలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, మేఘ్యతండాలో రూ.93లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో రూ.27లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ప్రాథమిక పాఠశాలలో రూ.39లక్షలతో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, నాయకులు ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, ఎంపీడీఓ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, ఈవో వీరబాబు, గంధం సురేష్, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి



రంగుండ్లతండాలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగుండ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్ యాదవ్, బాబురావు నాయక్, పంతు, సర్దార్ నాయకులు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీల వివరాలు పరిశీలిస్తున్న ఏపీఓ

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ, ఉల్సాయిపాలెం గ్రామాల్లో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మంగళవారం ఏపీఓ సూరనాయక్ పరిశీలించారు. అనంతరం కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ కూలీలకు పూర్తి స్థాయిలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు పనులను చేయాలని కోరారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రాములమ్మ, చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మిర్యాలగూడ : ఇటీవల వెలువడిన మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిగ్రీ ఫలితాల్లో పట్టణానికి చెందిన విజేత డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ధనుంజయ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి పది జీపీఏ సాధించినట్లు తెలిపారు. పది జీపీ సాధించిన విద్యార్థినిని ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ధనుంజయ

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. అనంతరం రత్నాకర్‌రెడ్డి సహకారంతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సుశీల, ఇందిర, రత్నాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గురువయ్య, అన్నారం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మాలి సైదులు తదితరులు పాల్గొన్నారు.